శేరిలింగంపల్లిని అభివృద్ధి చేస్తా


కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని సత్కరించిన రవికుమార్, గంగాధర్‌రెడ్డి, బీజేపీ నాయకులు

కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి అభివృద్ధికి కంకణం కట్టుకుంటానని చేవెళ్ల ఎంపీగా ఎన్నికైన కొండా విశ్వేశ్వర్‌రెడ్డి స్పష్టం చేశారు. కొండాపూర్ బీజేపీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో విశ్వేశ్వర్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చేవెళ్ల పార్లమెంటు పరిధి శేరిలింగంపల్లిలో అత్యధిక మెజార్టీ రావడం రవికుమార్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే భిక్షపతియాదవ్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా చేసిన కృషియే కారణమన్నారు. అందరికీ అందుబాటులో ఉంటూ అభివృద్ధియే లక్ష్యంగా పెట్టుకొని పనిచేస్తానన్నారు .కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్, గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, బీజేపీ నాయకులు రాఘవేంద్రరావు, భాస్కర్‌రెడ్డి, నాగులుగౌడ్, రవీందర్‌రావు, నరేష్, నర్సింగ్, భూపాల్‌రెడ్డి, ఆంజనేయులు, నవీన్‌గౌడ్, శ్రీధర్‌గౌడ్, మదనాచారి, వినయ, రామరాజు, నవతారెడ్డి, బసంత్ యాదవ్, రాధాకృష్ణ యాదవ్ పాల్గొన్నారు.

చంద్ర రాజేశ్వరరావుకు ఘన నివాళి


చంద్ర రాజేశ్వరరావుకు నివాళి అర్పిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

హఫీజ్‌పేట్: చంద్ర రాజేశ్వరరావు జయంతిని పురస్కరించుకొని గురువారం కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్‌లో ఆయన విగ్రహానికి సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు సురవరం సుధాకర్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్ర రాజేశ్వరరావు దేశానికి, రాష్ట్రానికి చేసిన సేవలు ఎనలేనివన్నారు. అనంతరం అభ్యుదయ రచయిత చంద్రమోహన్‌గౌడ్ చంద్ర రాజేశ్వరరావుపై రచించిన గేయాన్ని ఆలపించి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సీఆర్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి, కార్యదర్శులు చెన్నమనేని వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రావు, కోశాధికారి చెన్నకేశవరావు, ఆరోగ్య కేంద్రం డైరెక్టర్ డాక్టర్ కె.రజిని, ఎఐటీయూసీ మాజీ కార్యదర్శి విజయలక్ష్మి, తెలంగాణ అమరవీరుల ట్రస్ట్ కార్యదర్శి రత్నాకరరావు, మహిళా సంక్షేమ కేంద్రం ప్రిన్సిపల్ జోశ్యభట్ల కల్పన, ఆరోగ్య కేంద్రం సీఓఓ విజయలక్ష్మి, వృద్ధాశ్రమ సలహా కమిటీ సభ్యులు డాక్టర్ పి.సరస్వతి, రాజేంద్రరావు, వెంకటేశ్వరరావు, హోమ్ మేనేజర్ శ్రీనివాస్, వృద్ధాశ్రమవాసులు, మహిళా సంక్షేమ కేంద్రం విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు పెరిగిన ఓట్లు

ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు నర్సింహారెడ్డి


మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

పటాన్‌చెరు టౌన్: బీఆర్ఎస్ లోపాయికారి ఎత్తుగడతో బీజేపీ విజయం సాధించిందని, నైతికంగా విజయం కాంగ్రెస్ అభ్యర్థిదే అని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు నర్సింహారెడ్డి అన్నారు.గురువారం పటాన్‌చెరు పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పటాన్‌చెరు 113వ డివిజన్ ఎమ్మెల్యే ఎన్నికల్లో పటాన్‌చెరులో కాంగ్రెస్ పార్టీకి 7600 వస్తే ,ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికలో పటాన్‌చెరు డివిజన్‌లో 11,855 ఓట్లు వచ్చాయని, గత ఎమ్మెల్యే ఎన్నికలతో పోలిస్తే సుమారు 4500 అధికంగా వచ్చాయని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనను మెచ్చి ప్రజలు భారీగా ఓట్లు వేశారన్నారు. మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, డీసీసీ కార్యదర్శి సామయ్య, పట్టణ కార్యదర్శి అబ్దుల్లా పాష, రవి ముదిరాజ్ పాల్గొన్నారు.

బస్తీ దర్శన్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలోని శ్రీనివాస్‌నగర్ కాలనీ 8వ వార్డులో గురువారం బస్తీదర్శన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు పలు సమస్యలను కార్పొరేటర్ పుష్పనగేష్ దృష్టికి తీసుకొని వచ్చారు. ప్రధానంగా పార్కు చుట్టూ చెత్త చెదారం వేయడంతో ఇబ్బందులు పడుతున్నట్లు వివరించారు. తాగునీరు వచ్చినప్పుడు రోడ్లపై నీళ్లు వస్తున్నాయని తెలిపారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీవాసులు తన దృష్టికి తీసుకొనివచ్చిన సమస్యలను వెంటనే అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని తెలిపారు.


సమస్యలను తెలుసుకుంటున్న కార్పొరేటర్ పుష్పనగేష్

పర్యావరణాన్ని పరిరక్షించాలి

ఐఆర్‌బీ గోల్కొండ ఎక్స్‌ప్రెస్ వే ఉద్యోగులు

మణికొండ: ప్రస్తుత పరిస్థితిలో పర్యావరణాన్ని కాపాడాల్సిన అవసరం ఎంతో ఉందని ఔటర్‌రింగ్ రోడ్డు నిర్వహణ సంస్థ ఐఆర్‌బీ గోల్కొండ ఎక్స్‌ప్రెస్ వే సంస్థ ఉద్యోగులు అన్నారు. గురువారం పుప్పాలగూడ ఔటర్ రింగ్ రోడ్డు టోల్ గేట్ వద్ద ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు వాహన కాలుష్యాన్ని తగ్గించేందుకు వీలైనన్ని ఎక్కువ మొక్కలను నాటాలన్నారు. వాటితో మరింత స్వచ్ఛమైన గాలి మనకు వస్తుందన్నారు. భావి తరాలకు మెరుగైన పర్యావరణాన్ని అందించేందుకు ప్రస్తుత తరం కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా పర్యావరణాన్ని పరిరక్షిస్తామని, చెట్లు పెంచుతామని, ఇంధనాన్ని వృథా కానివ్వమని, మానవ నిర్మిత విధ్వంసాల నుంచి భూమాతకు రక్షణ కల్పిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సంస్థ ఉద్యోగులతో పాటు హెచ్ఎండీఏ సిబ్బంది పాల్గొన్నారు.



పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు

ప్రారంభోత్సవానికి సిద్ధం మున్సిపల్ భవనం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్‌లో నిర్మించిన మున్సిపల్ భవనం ప్రారంభోత్సవానికి సిద్ధమవుతోంది. సుమారు రూ.8కోట్ల 40లక్షల నిధులతో ఈ భవనాన్ని నిర్మించారు. మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్ ఛాంబర్‌తో పాటు వివిధ శాఖల కోసం 25గదులను నిర్మించారు. భవనం ప్రారంభం చేయాలనుకునే సమయానికి ఎన్నికల కోడ్ రావడంతో ప్రారంభోత్సవం వాయిదా పడింది. ప్రస్తుతం ఎన్నికలు పూర్తి కావడంతో రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ చేతుల మీదుగా ప్రారంభోత్సవానికి సిద్ధం చేస్తున్నారు.




నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలో బీఆర్‌టీఎస్ ప్రవేశపెడదామనుకున్న రోడ్డు ఇదే..

బీఆర్‌టీఎస్ లేనట్టేనా..?

కేపీహెచ్‌బీ-ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌కు ప్రతి 3 నిమిషాలకో బస్సు సౌకర్యం

- ఊసేలేని బస్ రాపిడ్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్
- మెట్రో ప్రతిపాదనతో తెర వెనక్కి..

రాయదుర్గం: ఐటీ ఉద్యోగులకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు ఏర్పాటు చేయతలపెట్టిన బస్ రాపిడ్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్ (బీఆర్‌టీఎస్) ప్రతిపాదనకే పరిమితం అయింది. కేపీహెచ్‌బీ నుంచి ఐటీ కారిడార్ మీదుగా ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతం వరకు ఈ బీఆర్‌టీఎస్ ప్రతిపాదనను ఆరేళ్ల క్రితం రూపొందించారు. అయితే ఇది ప్రభుత్వ పరిశీలనకే పరిమితం అయింది. కానీ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఓడిపోవడం, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఈ ప్రతిపాదన అమలులోకి వస్తుందా అనేది ప్రశ్నార్థకంగా మారింది.

ప్రతి 3 నిమిషాలకో బస్సు..

కేపీహెచ్‌బీ నుంచి ఐటీ కారిడార్ మీదుగా ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతం వరకు బీఆర్ఎస్‌టీఎస్‌లో భాగంగా ప్రతి 3 నిమిషాలకో బస్సు నడపాలని అప్పట్లో నిర్ణయించారు. ముఖ్యంగా మరిన్ని బస్సులు నడపాలనే లక్ష్యంతో కేపీహెచ్‌బీ నుంచి మాదాపూర్, మైండ్‌స్పేస్, హైదరాబాద్ నాలెడ్జిసిటీ, బయోడైవర్సిటీ పార్కు కూడలి, గచ్చిబౌలి,ట్రిపుల్‌ఐటీ కూడలి, విప్రో సర్కిల్ మీదుగా ఐటీ కారిడార్లను నానక్‌రాంగూడలోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతాన్ని కలుపుతూ 38 కిలోమీటర్ల వరకు బీఆర్‌టీఎస్ కల్పించాలని అప్పట్లో నిర్ణయించారు. ఈ విషయాన్ని నాలుగేళ్ళ క్రితం గచ్చిబౌలిలో ఇన్ఫర్మాటికా సంస్థ ఆర్ అండ్ డి సెంటర్ ప్రారంభ కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ ప్రకటించారు. దీంతో మాదాపూర్, గచ్చిబౌలి,రాయదుర్గం సర్వే నెంబర్ 83లోని హైదరాబాద్ నాలెడ్జిసిటీ, నానక్‌రాంగూడ ఐటీకారిడార్లు, నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతాలలోని జాతీయ, అంతర్జాతీయ సంస్థల్లో పనిచేసే ఐటీ ఉద్యోగులకు రవాణా సౌకర్యం మరింత మెరుగుపడేందుకు దోహదం చేసేది. మొదటి విడత ఈ రూట్లో ప్రయోగాత్మకంగా ప్రారంభించి పరిశీలించి విజయవంతమైతే మరిన్ని రూట్లలో కూడా ఇలాంటి సౌకర్యాన్ని విస్తరించాలని ప్రతిపాదనలోనే పేర్కొన్నారు.

ఆయా రూట్లలో ఎలక్ట్రిక్, అత్యాధునిక బస్సులే..

కేపీహెచ్‌బీ-ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతాల మధ్య బీఆర్‌టీఎస్ బస్సులను పూర్తిగా ఎలక్ట్రిక్, అత్యాధునిక బస్సులనే నడపాలని నిర్ణయించారు. ఆయా రూట్లలో ఎలక్ట్రిక్ చార్జింగ్ పాయింట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

మెట్రో రైలుపై దృష్టి

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రవాణా సౌకర్యాన్ని మరింత మెరుగుపర్చేందుకు మెట్రో రైలు సౌకర్యంపై దృష్టి పెట్టింది. మాదాపూర్ మైండ్‌స్పేస్‌లోని రాయదుర్గం మెట్రోస్టేషన్ నుంచి గచ్చిబౌలి మీదుగా ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వరకు మెట్రోను పొడిగించాలని తాజాగా నిర్ణయించారు. బీఆర్‌టీఎస్ కల్పించాలని తలపెట్టిన ప్రాంతం మీదుగా మెట్రో వస్తుండడంతో ఇక బీఆర్‌టీఎస్ అవసరం లేదనే అభిప్రాయం నెలకొంది. మెట్రో సౌకర్యాన్ని రాయదుర్గం నుంచి గచ్చిబౌలి మీదుగా నానక్‌రాంగూడ ఐటీకారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతం వరకు పొడిగించాలని ఐటీ ఉద్యోగులు అప్పట్లో డిమాండ్ చేశారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


అవగాహన కల్పిస్తున్న సభ్యులు

మణికొండ: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని నార్సింగి ట్రాఫిక్ ఎస్సై రాజేశ్‌గౌడ్ అన్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోకాపేట టీగ్రిల్ జంక్షన్ వద్ద రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌ను, కార్లలో ప్రయాణించే వారు సీట్ బెల్ట్‌లను పెట్టుకోవాలన్నారు. ట్రాఫిక్ సిగ్నల్ వద్ద నిబంధలను పాటించినపుడే అందరూ క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకుంటారన్నారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ కేశవ్‌తో పాటు సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ సభ్యులు నితా వర్గేరి, దిలిప్ కక్కడ్, రాజశేఖర్‌రెడ్డి, జయకర్, శ్రీనివాస్, మహేష్‌కుమార్, నాగేష్, కల్యాణి, రాజిరెడ్డి, శ్రీకాంత్, పాల్‌రాజ్, వైభవ్ పాల్గొన్నారు.

అన్నదానం



మణికొండ: ప్రతి అమావాస్య రోజు అన్నదానం చేస్తున్నామని మణికొండ వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ తెలిపింది. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు యాదగిరి మాట్లాడుతూ ప్రతి అమావాస్య రోజు తమ అసోసియేషన్ తరపున అన్నదానం చేస్తున్నామన్నారు. ఇలాంటి కార్యక్రమాలతో మానసిక తృప్తితో పాటు పేదల ఆకలి తీరుతుందన్నారు.

నాణ్యత పాటించాలి

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ ఛత్రపతి శివాజీ నగర్‌లోని రోడ్డు నంబర్ 1- 4లో సీసీ రోడ్డు కోసం గతంలో పదిహేను లక్షల రూపాయల నిధులు మంజూరై, నిర్మాణ పనులు పూర్తయ్యాయి. మరో రెండు వీధుల్లో సీసీ రోడ్లను నిర్మిస్తున్నారు. ఈ నిర్మాణ పనులను గురువారం స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణ పనుల్లో నాణ్యత తప్పనిసరి అని యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. రోడ్డుపై వర్షపు నీరు నిలవకుండా పనులు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో శివరాజ్‌గౌడ్, అంజయ్య యాదవ్, బాలరాజు, కె. రమేష్, పోశెట్టి గౌడ్, రాజేందర్, పదయ్య, పోచయ్య, ఎల్. రాజు, తాతబాబు తదితరులు పాల్గొన్నారు.

రేణుక ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో గురువారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

శనీశ్వర జయంతి

పటాన్‌చెరు పాత టోల్‌గేట్ సమీపంలోని శ్రీ రామలింగేశ్వర దేవస్థానంలో శనీశ్వర జయంతి సందర్భంగా ఆలయ అర్చకులు మహేష్, గణేష్ స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అలకాపూర్ సమస్యలు తీర్చండి

మున్సిపల్ కమిషనర్‌ను కోరిన నాయకులు


మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న అలకాపూర్ టౌన్‌షిప్ నాయకులు

మణికొండ: అలకాపూర్ టౌన్‌షిప్‌లోని ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మణికొండ మున్సిపల్ కమిషనర్ డి. ప్రదీప్‌కుమార్‌ను సంక్షేమ సంఘం నాయకులు కోరారు. గురువారం అలకాపూర్ టౌన్‌షిప్ నివాసితుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు వంశీ ఆధ్వర్యంలో నాయకులు ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అలకాపూర్ టౌన్‌షిప్‌లో రోడ్ల అభివృద్ధి, వీధి దీపాలు, ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలను నివారించాలని, స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు, సైన్ బోర్డులను తొలగించాలన్నారు. అలాగే ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయాలని, నాలాలను క్లీన్ చేయాలని, మ్యాన్‌హోల్‌ల మరమ్మతులు చేపట్టాలన్నారు. వాకింగ్ ట్రాక్‌ల మెయింటెనెన్స్, టౌన్‌షిప్‌లో కమ్యూనిటీ హాల్‌ను నిర్మించాల కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఫీజులను నియంత్రించాలి

ఎస్ఎఫ్ఐ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి మహేష్


ఎంఈఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పటాన్‌చెరు టౌన్: ప్రైవేట్ విద్యాసంస్థలలో ఫీజులను నియంత్రించాలని, అనుమతులు లేకుండా అడ్మిషన్లు చేస్తున్న పాఠశాలలపై తగిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి మహేష్ డిమాండ్ చేశారు. గురువారం పటాన్‌చెరు పట్టణంలోని ఎంఈఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మహేష్ మాట్లాడుతూ... అనుమతులు లేకుండా కొన్ని ప్రైవేట్ పాఠశాలలు ముందస్తు అడ్మిషన్లు చేస్తూ రిజిస్ట్రేషన్ ఫీజులు సైతం భారీ మొత్తంలో వసూలు చేస్తున్నారని తెలిపారు. అదేవిధంగా ఫీజులు పెంచుతూ డబ్బులు పిండుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు .విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయని పాఠశాలలపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు .ఎస్సీ,ఎస్టీ బీసీ, మైనార్టీల వర్గాల విద్యార్థులకు 25% ఉచిత విద్యను అందించాలని ,పాఠశాలలో యూనిఫామ్ నోట్‌బుక్స్ అమ్మకాలను నిషేధించాలన్నారు. అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు, విజయ్ పాల్గొన్నారు.

కేపీహెచ్‌బీ డివిజన్ సమస్యలు పరిష్కరించండి

కాంగ్రెస్ నాయకులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని కేపీహెచ్‌బీ డివిజన్‌లోని సమస్యలను కాంగ్రెస్ పార్టీ నాయకులు కొప్పిశెట్టి దినేష్‌కుమార్, కంటెస్టెడ్ కార్పొరేటర్ గంధం రాజు ఆధ్వర్యంలో గురువారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రధానంగా కేపీహెచ్‌బీ కాలనీకి ఎంతో ప్రతిష్టాత్మకమైన రమ్య గ్రౌండ్ ప్రహరీ గోడ శిథిలస్థితిలో ఉందని తక్షణమే మరమ్మతులు చేయకపోతే పూర్తిగా కోల్పోయే ప్రమాదం ఉందని తెలిపారు. కేపీహెచ్‌బీ కాలనీలోని తొమ్మిదో ఫేజు మెయిన్ రోడ్డుమీద ఉన్న మున్సిపల్ పార్కు గత దశాబ్ద కాలంగా ఆదరణకు నోచుకోకుండా చెత్తతో నిండి పోయిందని వెంటనే మున్సిపల్ అధికారులు పార్కును అభివృద్ధి చేయాలన్నారు. ముఖ్యంగా కేపీహెచ్‌బీ 6వ ఫేజు, సర్దార్ పటేల్‌నగర్‌లోని మోడల్ రైతు బజార్లను పూర్తిగా నిర్వీర్యం చేసి కొంత మంది ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేశారని తెలిపారు. ఈ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రామారావు, సురేష్, రాజేష్, సుబ్బు, వనజ, వీణ, సుజాత, సరోజ తదితరులు పాల్గొన్నారు.


బండి రమేష్‌ను కలిసి సమస్యలను వివరిస్తున్న దినేష్, గంధం రాజు, నాయకులు

17న ఆలయ వార్షికోత్సవం

రాయదుర్గం: టెలికామ్‌నగర్‌లోని సాయిదత్త గణపతి ఆలయ దశమ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ నిర్వాహకులు రవీందర్‌రెడ్డి తెలిపారు. ఈనెల 17వ తేదీ ఉదయం 5.30 గంటలకు షిర్డీ సాయిబాబాకు కాగడ హారతితో ఈ వేడుకలను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. గణపతి పూజ, పుణ్యాహవచనం, మంటపారాధన, రుద్ర హోమం, నవగ్రహహోమం సాయంత్రం 4 గంటలకు సాయిబాబా పల్లకిసేవ (నగరసంకీర్తన) కార్యక్రమాన్ని ఉంటుందన్నారు. సాయంత్రం 6.15 గంటలకు సంధ్యాహారతి (ధూప్ హారతి) నిర్వహిస్తామని, ఆ తర్వాత సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు భజన బృందంచే ప్రత్యేక భజన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. రాత్రి 9 గంటలకు శేజ్ హారతి కార్యక్రమం నిర్వహణతో వేడుకలను ముగించనున్నట్లు తెలిపారు.

నల్లగండ్లలో నటి శ్రియారెడ్డి సందడి


అపర్ణ నియోమాల్‌లో నటి శ్రియారెడ్డి

హఫీజ్‌పేట్: శేరిలింగంపల్లి నల్లగండ్లలోని అపర్ణ నియో మాల్‌లో గురువారం సలార్ ఫేమ్ నటి శ్రియా రెడ్డి సందడి చేశారు. మాల్‌లోని కమల్ వాచెస్‌లో ప్రత్యేక ఎడిషన్ టైమెక్స్, గెస్ వాచెస్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడారు. టైమెక్స్ ఇండియా ఎండీ దీపక్ ఛాబ్రా, ప్రతినిధులు పాల్గొన్నారు.

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి

ఎంఈఓ పీపీ రాథోడ్


ఉపాధ్యాయులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంఈఓ రాథోడ్

పటాన్‌చెరు టౌన్: బడీడు పిల్లలు, ఐదేళ్లు నిండిన వారు, బడి బయటి పిల్లలు, మధ్యలో బడి మానేసిన వారిని గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈఓ పీపీ రాథోడ్ అన్నారు. గురువారం పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో బడిబాట కార్యక్రమాన్ని హెచ్ఎం, ఉపాధ్యాయులతో కలిసి ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జూన్ 6 వ తేదీ నుండి 19 వ తేదీ వరకు బడిబాట కార్యక్రమం జరుగుతుందన్నారు. బడి మధ్యలో మానేసిన విద్యార్థులను గుర్తించి పాఠశాలలో చేర్పించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు.

సన్మానం


వడ్డేపల్లి రాజేశ్వరరావును సన్మానించిన అసోసియేషన్ సభ్యులు

ఆల్విన్‌కాలనీ: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావును వివేకానందనగర్‌లోని ఆయన నివాసంలో కూకట్‌పల్లి డివిజన్ సాయిబాబా నగర్ కాలనీ ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈటల రాజేందర్ విజయం సాధించిన నేపథ్యంలో రాజేశ్వరరావును శాలువాతో సత్కరించి, మిఠాయిలు పంచుకున్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు శంకర్, కాశిరెడ్డి, ప్రదీప్, రమణారెడ్డి, చంద్రశేఖర్, ప్రవీణ్, హరి, ఫణి, జనార్దన్, చంద్రప్రకాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన


సంజయ్‌గాంధీనగర్‌లో చెత్త సేకరణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: చెత్తను ఇంటి వద్దకు వచ్చే చెత్త సేకరణ కార్మికులకు అందించాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర అన్నారు. గురువారం సంజయ్‌గాంధీనగర్, ఇంద్రారెడ్డినగర్‌లలో చెత్త సేకరణను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పించి చెత్తను కార్మికులకు అందించాలని సూచించారు. అలాగే కాళీమందిర్ మెయిన్ రోడ్డుపై జరుగుతున్న రోడ్డు శుభ్రతా పనులను పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొంతమంది చెత్తను కార్మికులకు ఇవ్వకుండా రోడ్ల పక్కన, ఖాళీ ప్రదేశాల్లో పడేస్తున్నారని దీని కారణంగా ఆయా ప్రాంతాలన్నీ దుర్వాసన వెదజల్లుతున్నాయన్నారు. పారిశుద్ధ్యం విషయంలో ప్రజలు సహకరించాలన్నారు.

ప్రత్యేక పూజలు


పూజలో పాల్గొన్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మ బండ ఎన్‌టిఆర్‌నగర్‌లోని శ్రీ షిరిడి సాయి బాబా ఆలయంలో గురువారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. హారతి , అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో యువ నేత దొడ్ల రామకృష్ణ గౌడ్, పోశెట్టిగౌడ్, రాజేందర్, పదయ్య, కె.నరసింహులు, సిద్దయ్య, రాజ్యలక్ష్మి, రేణుక, రాజేశ్వరి, నాగరాణి, అశ్విని, సుజాత తదితరులు పాల్గొన్నారు.

లిఫ్టు గుంతలో పడి కార్మికుడి మృతి

హఫీజ్‌పేట్: నిర్మాణంలో ఉన్న భవనం లిఫ్టు గుంతలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రమేష్‌సింగ్ (40) గత 20 రోజుల క్రితం గంగారం అపర్ణ హిల్ రిజ్ పక్కనే ఉన్న రంజన్ వైభవ్ కన్‌స్ట్రక్షన్ కంపెనీలో కార్మికుడిగా పని చేస్తున్నాడు. గురువారం భవనంలోని 11వ ఫ్లోర్‌లో పని చేస్తుండగా జారి లిఫ్ట్ గుంతలో పడిపోయాడు. తీవ్రగాయాలైన అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో ఈ విషయం తెలుసుకున్న చందానగర్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టమ్ నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు.